క్లుప్తంగా

గోదావరి జలాలకు పూజలు



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లిలో 71 డీబీఎం కాలువ వద్ద గోదావరి జలాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి హారతులిచ్చి టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొరపెడత అవిలయ్య, గ్రామ అధ్యక్షుడు దండ వీరారెడ్డి, గ్రామ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మోతె : గ్రామగ్రామాన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు బుర్కచర్ల, హుస్సేనబాద్ గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంటు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నూతనకల్ : గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించడానికి ప్రయత్నించిన 10మందిని తహసీల్దార్ శ్రీనివాసరావు ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ అయిన వ్యక్తులను రూ. లక్ష పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

జాజిరెడ్డిగూడెం సీపీఎం కార్యదర్శిగా విజయ్‌కుమార్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం గ్రామ సీపీఎం కార్యదర్శిగా కొమ్ము విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఎన్నికను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, చెన్నబోయిన వీరయ్య, శిగ వెంకన్న, రాములు, రవికుమార్, వినయ్, శ్రీనివాస్, శ్రీకాంత్, యాదగిరి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సహాయ వంటమనిషి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ధారాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి ఏడవ తరగతి వరకు చదివిన మండలంలోని మహిళలు అర్హులని తెలిపారు. తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 25 వరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నీరు నిల్వకుండా చూడాలి

మద్దిరాల : గ్రామాల్లోని వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో పర్యటించి పలు వీధులను పరిశీలించారు. ప్రస్తుతం గ్రామాల్లో విష జ్వరాల వ్యాప్తి ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిల్వ నీటిలో చేరిన దోమల లార్వా ద్వారా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నీటి గుంతలను గుర్తించి అందులో ఆయిల్ బాల్స్‌ను వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లను నియమించాలి

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లను, స్వీపర్లను నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లో స్వీపర్లు, అటెండర్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గూడపూడి వెంకటేశ్వర్లు, కండె భిక్షం, సర్వాప, రాములు, పద్మ, మారయ్య, శ్రీను, బయ్యన్న, జానయ్య, వెంకటయ్య ఉన్నారు.

తిరుమలగిరిలో భారీ వర్షం

తిరుమలగిరి : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సూర్యాపేట - జనగామ ప్రధాన రహదారిపై భారీగా నీళ్లు నిలిచాయి. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట, చౌరస్తాలో నీళ్లు చేరాయి. మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



తిరుమలగిరిలో సూర్యాపేట - జనగామ ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- ఇటీవల వరదలకు దెబ్బతిన్న మర్రిబావితండా రోడ్డు
- అడుగడుగునా గుంతలు
- రోడ్డును బీటీగా మార్చాలని తండావాసుల వేడుకోలు



గుంతలమయమై నీటితో నిండిన తండా దారి



వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు



మర్రిబాయితండా రోడ్డుపై బురదలో దిగబడిన ఆటోను నెట్టుతున్న విద్యార్థులు

అర్వపల్లి : వర్షాలకు మండల పరిధిలోని మర్రిబావి తండా రోడ్డు ఎక్కడికక్కడ దెబ్బతిన్నది. ఇటీవల వర్షాలు పడిన రెండు రోజులు ఆ తండాకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం రోడ్డు బురదమయంగా ఉండడంతో గిరిజనులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

సరైన దారి లేకపోవడంతో..

మర్రిబావి తండా ఏర్పడి 30 ఏళ్లు దాటింది. ఈ తండాలో 25 ఇళ్లు, వందకు పైగానే జనాభా ఉంటుంది. కానీ ఇంత వరకు ఈ తండాకు కేవలం మట్టిరోడ్డే. వర్షాలు పడితే ఈ దారి నుంచి ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తండా వరకు కిలో మీటరున్నర దూరం ఉంటుంది. పూర్తిగా ఫార్మేషన్ రోడ్డు కావడంతో వర్షాలు పడిన ప్రతిసారి రోడ్డు కొట్టుకుపోయి గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం దారిలో రాళ్లు తేలి బురదమయమై గుంతలు పడి అధ్వానంగా మారింది. ప్రతిరోజు తండా నుంచి విద్యార్థులు చదువుల కోసం చుట్టుపక్కల గ్రామాలకు వెళ్తుంటారు. కానీ దారి సరిగా లేక ఆటోలు బురదలో దిగబడటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ దారిని బీటీ చేయాలని తండా గిరిజనులు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇప్పటికైనా ఈ తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాకపోకలు నిలిచిపోయాయి



మా తండాకు ఇప్పటి వరకు ఫార్మేషన్ రోడ్డే. ఇటీవల భారీ వర్షాలకు ఈ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. వరదలకు రెండు రోజుల పాటు తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా మా తండా రోడ్డును బీటీగా మార్చాలి.

\- బానోతు ప్రవీణ్, తండావాసి

ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాం



మా తండాకు పక్కారోడ్డు నిర్మించాలని గిరిజనులం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాం. ఇంత వరకు రోడ్డు నిర్మాణం జరగలేదు. మా కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు లేక ఏ ఆపద వచ్చినా వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

\- జాటోతు నరేష్, మర్రిబావితండా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ

నాగారం : గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సీడీపీఓ శ్రీజ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అలాగే పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఇటీవల రిటైర్డ్ అయిన ఆయాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు వై.వసంత, రేఖల సుమిత్ర, సరస్వతి, హరిత, రజిత, మంజుల, ఉష, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన



నాగారం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

నాగారం : ధరణి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూర్యాపేట ఆర్డీఓ ఆర్.వేణుమాధవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. రెవెన్యూ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ధరణి ఫిర్యాదులు, వివరాలను అప్‌లోడ్ చేయడం, ధరణి రికార్డులను పరిశీలించారు. అలాగే రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్‌ఐలు అల్లావుద్దీన్, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కోరుతూ పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న మల్లు నాగార్జున్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

నూతనకల్ : మండల కేంద్రం నుంచి చిల్పకుంట్ల, వెంకెపల్లి, తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం వరకు రోడ్డును పునఃనిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ఈ పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రానికి ప్రధాన రహదారిని గత కొన్ని సంవత్సరాలుగా పునఃనిర్మించకపోవడంతో రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేసి శిలాఫలకానికే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రోడ్డు నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యుడు మందుల సామేల్, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్ల పునఃనిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, దండా వెంకట్‌రెడ్డి, బత్తుల జనార్దన్, పల్లా సుదర్శన్, అలీపురం సంజీవరెడ్డి, చూడి మధుసూదన్‌రెడ్డి, అందెపల్లి లక్ష్మయ్య, తొట్ల లింగయ్య, తొనుకునూరి ఉప్పలయ్య, ఎల్లావుల నరేష్, పులసరి వెంకటముత్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మండల స్థాయి క్రీడా పోటీలు



తిరుమలగిరిలో క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ



నూతనకల్ : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

తిరుమలగిరి : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక పటుత్వానికి దోహద పడతాయని, క్రీడాకారుల్లో స్నేహ సంబంధాలు ఏర్పడుతాయని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, రెండవ వార్డు కౌన్సిలర్ సీహెచ్.హన్మంతు, తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, ఎస్‌ఐ వి.సురేష్, పాప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతనకల్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ సునీత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధను కనబర్చి విద్యార్థులకు క్రీడలపై తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. డివిజన్ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు మండల స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి రాములు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వైద్యసిబ్బందికి సన్మానం



బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న వైద్యాధికారి స్రవంతి, తదితరులు

పెన్‌పహాడ్ : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బందిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి స్రవంతి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఎల్‌డీసీ నర్సింహారావు, హెల్త్ అసిస్టెంట్ కళావతి, సిబ్బంది కళావతి, అమీమ్‌లు ఉన్నతమైన సేవలు అందించారని ఆమె తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్లిన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సునంద, హెచ్‌ఈఓలు చంద్రశేఖరరాజు, శ్రీనివాసులు, పీహెచ్‌ఎన్ శశిరేఖ, సూపర్‌వైజర్‌లు జానకమ్మ, సైదయ్య పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

నూతనకల్ : జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామ్మూర్తి గౌడ్ కోరారు. శుక్రవారం నూతనకల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాలో బీసీలకు చెందిన ఒక్కరే ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి అగ్రవర్ణ నాయకుల పెత్తనమే కొనసాగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించే విధంగా ప్రభుత్వం కుల గణన చేపట్టాలని కోరారు. త్వరలో మండలంలో బీసీల మేలుకొల్పు సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభకు బీసీ కుల సంఘాలు, కవులు, కళాకారులు, మేధావులు సహకరించాలని కోరారు.

భూ ఆక్రమణలు అడ్డుకోవాలి

మునగాల : గ్రామాల్లో అన్యాక్రాంతమైన దేవాలయ భూములను పరిరక్షించాలని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ ఎండీ.కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణకు గురైన ఆలయ భూములను స్వాధీన పరచుకుని, బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇచ్చి ఆలయాల అభివృద్ధికి కృషిచేయాలని కోరినట్లు తెలిపారు.

డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితం అంధకారం



మద్దిరాల : మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వీరన్న



నాగారం : విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఐలయ్య

మద్దిరాల : డ్రగ్స్‌కు అలవాటుపడిన వ్యక్తి జీవితం అంధకారం అవుతుందని మద్దిరాల ఎస్‌ఐ ఎం.వీరన్న అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనపై శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి బారి నుంచి మన సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. గంజాయి రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి కలిగిఉన్నట్లు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి సమాచారం తెలపాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నాగారం : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఎం.ఐలయ్య అన్నారు. శుక్రవారం నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరాల వల్ల అనేక మంది మోసపోయి తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని అన్నారు. తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ తదితర వాటిని బహిర్గతం చేయవద్దని సూచించారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఎల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఆపి.. గుంత పూడ్చి



తుంగతుర్తి నుంచి వెలుగుపల్లికి వెళ్లే దారిలో ఉన్న వాగు వంతెన ఇటీవల వర్షాలకు దెబ్బతింది. ఈ వంతెనపై నుంచి వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారింది. దీంతో శుక్రవారం ఆ రూట్‌లో వెళ్లే ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ బస్సును ఆపి గుంతను పూడ్చారు. - తుంగతుర్తి

మందుల కొరత ఉండొద్దు

అర్వపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత తీర్చాలని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లేటి రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిత్యం పేద ప్రజలు వాడే మందులు దొరకడం లేదని అన్నారు. అర్వపల్లి పీహెచ్‌సీకి వెళ్లగా బీపీ గోలీలు, గ్యాస్ట్రిక్ టానిక్, ముక్కులో వేసుకొనే డ్రాప్స్‌తోపాటు వివిధ రకాల మందులు లేనట్లు తెలిసిందని అన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆస్పత్రులకు నిత్యం వెళ్తున్నందున అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని కోరారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ధర్నా



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపుగా రూ.4500 కోట్ల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సురగాని పరశురాం, రాజుల శివతేజ, అమరబోయిన ఉపేందర్, నరేష్, సురేష్, సతీష్, నవీన్‌నాయుడు, రాకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వడంలో ఆలస్యం చేయొద్దు

తుంగతుర్తి : మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయొద్దని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు రావాల్సిన రైతుభరోసా, రుణమాఫీ అందలేదన్నారు. వరదల్లో పంటలు మునిగి రైతులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తుంగతుర్తి మండల పరిధిలోని కేశవాపురం, వెలుగుపల్లి, అన్నారం, సంగెం, రావులపల్లి, మానాపురం, బండరామారం గ్రామాలకు చెందిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రూ. 15వేలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలి



వసతులను పరిశీలిస్తున్న కమిటీ చైర్మన్లు

ఆత్మకూర్ (ఎస్) : ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల విద్యా కమిటీ చైర్మన్లు అన్నారు. బదిలీల్లో భాగంగా శుక్రవారం పలువురు టీచర్లు ఆత్మకూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు రాగా వారి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నూతనంగా పాఠశాలకు వచ్చిన సిబ్బంది పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేయాలన్నారు. అనంతరం పిల్లల హాజరు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల చైర్మన్లు తోట జ్యోతి, సైదమ్మ, మంజుల, ఉప్పమ్మ, లలిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



దురాజ్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల విద్యార్థులు

చివ్వెంల : దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీస్వామి నారాయణ్ గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పిస్తూ దురాజ్‌పల్లి, ఉండ్రుగొండ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్.శ్రీనివాస్ ఆనంద్, డైరెక్టర్ హర్షిక్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

కోదాడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కోదాడలో నష్టపోయిన బాధితులకు కోదాడ బాలుర పాఠశాల విద్యార్థులు అండగా నిలిచారు. విరాళాల రూపంలో రూ.20 వేలు సేకరించి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి శుక్రవారం పాఠశాలలో ఎంఈఓ సలీంషరీఫ్, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, లంకెల నిరంజన్‌రెడ్డి, కమిషనర్ రమాదేవి, ఉపాధ్యాయులు మార్కండేయ, బడుగుల సైదులు, శ్రీనివాసరెడ్డి, ఖాజా, లింగయ్య, రామకృష్ణ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఎందే

మునగాల : ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఎంకే ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం కొక్కిరేణిలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా నందిగామ సైదులును రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రావులపెంట వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు